తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
27-04-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 249 | పేజీలు : 8 | వెల : 4



జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889



JB జయభేరి




## రూ. వంద కోట్లకు పైగా ఆస్తులు..!

- తెలంగాణలో 8 మంది రిచెస్ట్ ఎంపీ అభ్యర్థులు
- ఒక్క చేవెళ్ల నుంచే ముగ్గురు..!

తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పలువురు అభ్యర్థులు సంపన్నులుగా ఉన్నారు. ఎన్నికల అఫిడవిట్ లో ఆయా అభ్యర్థుల ఆస్తులు... వంద కోట్లకుపైగా చూపించారు.
తెలంగాణలో పోటీ చేస్తున్న పలువురి అభ్యర్థుల ఆస్తులు వంద కోట్లకు పైగా ఉన్నాయి. ఈ లిస్ట్ లో ఎనిమిది మంది ఉన్నారు. ఆయా అభ్యర్థులు వారి కుటుంబ ఆస్తులతో కలిపి రూ.100 కోట్లకు పైగా ఆస్తులను ప్రకటించారు. ఇందులో స్థిర, చర ఆస్తులు ఉన్నాయి. రాష్ట్రంలోని చేవెళ్ల నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. మొత్తం 4,568 కోట్ల రూపాయల సంపదతో అత్యంత సంపన్న అభ్యర్థిగా నిలిచారు.
చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యర్థిగా కాంగ్రెస్ తరపున బరిలో ఉన్న రంజిత్ రెడ్డి ఆస్తులు కూడా భారీగానే ఉన్నాయి. మొత్తం రూ.435.33 కోట్లతో రెండో ధనవంతుడిగా నిలిచారు. అప్పులు రూ.23 కోట్లుగా ఉన్నాయి. ఆయన కుటుంబానికి రూ.294.33 కోట్ల విలువైన చరాస్తులు ఉండగా, స్థిరాస్తుల విలువ రూ.141 కోట్లు. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే... చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ కూడా అత్యధిక సంపద కలిగిన అభ్యర్థిగా ఉన్నారు.

...మిగతాది 2 లో

## వారిలో ఎవరికి ఓటు వేసినా ఒక్కటే



- మోదీ బడే భాయ్, రేవంత్ చోటే భాయ్
- బస్సుయాత్ర లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

జయభేరి, మహబూబ్ నగర్ :
బస్సుయాత్ర మహబూబ్ నగర్ లో కొనసాగుతోంది. నగరంలో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడిన ఆయన... బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. పదేళ్ల పాలనలో బీజేపీ ఏం చేసిందనేది ప్రజలంతా ఆలోచించాలని కోరారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఈ పదేళ్లలో మోదీ కనీసం 100 నినాదాలు ఇచ్చారని... కానీ ఒక్క నినాదం కూడా నెరవేరలేదని విమర్శించారు. వాటితో ప్రజలకు ఎలాంటి లాభం జరగలేదని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తలపెట్టిన బస్సుయాత్ర... మహబూబ్ నగర్ కు చేరుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన కేసీఆర్... "తెలంగాణ ఉద్యమం సమయంలో ఆంధ్ర వాళ్లు ఇక్కడ నుండి కాలువ పెట్టి మన నీళ్లు తీసుకుపోతుంటే.. రఘువీరా రెడ్డి పాదయాత్ర చేసుకుంటూ వస్తే ఇదే డీకే అరుణ నీళ్లు తీసుకుపొండి అని మంగళ హారతులు పట్టింది. ఈమెకు మనం ఓటు వేయాలా" అని ప్రశ్నించారు.

...మిగతాది 2 లో



## నేను చచ్చే దాకా కాంగ్రెస్ లో ఉంటా

జయభేరి, హైదరాబాద్ :
నేను చ్చే దాకా కాంగ్రెస్ లో వుంటానని మాజీ ఎంపి వి హనుమంతరావు అన్నారు. శుక్రవారం అయన గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతది. ఉద్యోగాలు రావాలన్నా, ప్రమోషన్లు కావాలన్న రాహుల్ గాంధీ ప్రదాని కావాలి. దేశంలో బీసీలు ఎక్కువగా ఉన్నారు. మోడీ బీసీలకు ఎలాంటి న్యాయం చేయలేదు. మోడీకి ఓటు వేస్తే ఆదాని, అంబానీ లకు ఓటు వేసినట్లే. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు వేయించే భాద్యత బీసీలు తీసుకోవాలనిఅన్నారు.



## ప్రశాంతంగా ముగిసిన రెండో దశ పోలింగ్

- త్రిపురలో అత్యధికం.. యూపీలో అత్యల్పం

2024 లోక్ సభ ఎన్నికల రెండో దశ పోలింగ్ ముగిసింది. చెదురుముదురు ఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. రెండో దశలో త్రిపురలో అత్యధిక పోలింగ్, యూపీలో అత్యల్ప పోలింగ్ నమోదైంది. రెండో దశ పోలింగ్ చాలా బాగా జరిగిందని ప్రధాని మోదీ శుక్రవారం సాయంత్రం ట్వీట్ చేశారు.
2024 లోక్ సభ ఎన్నికల రెండో దశ పోలింగ్ శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 6 గంటల వరకు జరిగింది. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ బూత్ ల్లో క్యూలో

...మిగతాది 2 లో



## రక్షణకు భారీగా 91 వేల కోట్ల డాలర్లు..

జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 :
ప్రపంచంలో అన్ని దేశాలు ప్రస్తుతం రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందుకోసం సైన్యానికి, ఆయుధాలకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశాలు రక్షణకు ఎంత వ్యయం చేస్తున్నాయో స్టాక్ హోం అంతర్జాతీయ శాంతి పరిశోధక కేంద్రం(సిప్రి) తాజాగా నివేదిక విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం రక్షణ వ్యయంలో అమెరికా అగ్రస్థానంలో ఉంది. ఈ దేశం రక్షణ కోసం 91 వేల కోట్ల డాలర్లు వెచ్చిస్తోంది. ఇక 2023 నివేదిక ప్రకారం భారత్ రూ.8,300 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తుంది. మన దేశంలో ప్రపంచంలో రక్షణ వ్యయంలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. రెండు, మూడో స్థానాల్లో చైనా,

...మిగతాది 2 లో





## రాజీనామా రెడీగా పెట్టుకో

జయభేరి, హైదరాబాద్ :
హరీష్ రావుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మోసం చేయాలనుకునే ప్రతీ సారి హరీష్ కు అమరవీరుల స్థూపం గుర్తొస్తది. హరీష్ మోసానికి ముసుగు అమరవీరుల స్థూపం. ఇన్నాళ్లు ఎప్పుడైనా అమరుల స్థూపం దగ్గరకు వెల్లారా? చాంతాడంత లేఖ రాసు కొచ్చి రాజీనామా లేఖ అంటుండు. రాజీనామా లేఖ అలా ఉండదు. హరీష్ తన మామ చెప్పిన సీస పద్యమంతా లేఖలో రాసుకొచ్చారు. స్పీకర్ ఫార్మాట్ లో లేకుంటే రాజీనామా లేఖ చెల్లదు. హరీష్ రావు తెలివి ప్రదర్శిస్తున్నారు. హరీష్ తెలివి మోకాళ్లలో కాదు.. అరికాళ్లలోకి జారినట్టుంది. హరీష్.. ఇప్పటికీ చెబుతున్నా.. నీ సవాల్ ను ఖచ్చితంగా స్వీకరిస్తున్నాం. పంద్రాగస్టులోగా రూ. 2లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతాం... నీ రాజీనామా రెడీగా పెట్టుకోఅని అన్నారు...

## గన్నార్క్ చేరిన రుణమాఫీ రాజకీయం

...మిగతాది 3 లో



## కోటి దాటేసిన హైదరాబాద్ ఓటర్లు

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల26 :
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటర్ల సంఖ్య కోటి దాటింది. తెలంగాణ మొత్తం ఓటర్లలో ఇది 30 శాతంగా ఉంది. కానీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటింగ్ శాతం కనిష్ఠంగానే నమోదు అవుతుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య కోటి దాటింది. వేగంగా విస్తరిస్తున్న నగరంతో పాటు ఓటర్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2019 లోక్ సభ ఎన్నికల నుంచి ప్రస్తుతం జరగనున్న ఎన్నికల వరకు సుమారు 15 లక్షల మందికి పైగా కొత్త ఓటర్లు నమోదు అయినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు.ఎన్నికల కమిషన్ లెక్కల ప్రకారం... ప్రస్తుతం గ్రేటర్ లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఓటర్ల సంఖ్య 1.05 కోట్లు దాటింది. మొత్తం తెలంగాణ ఓటర్లలో ఇది 30%

...మిగతాది 2 లో

## లోకసభ తర్వాత స్థానిక సమరం

- జూన్ నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు




జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 26:
లోక్సభ ఎన్నికల అనంతరం తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తం అవుతోంది. ఇందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఎన్నికలను ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ బాక్సులతో నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. ఈమేరకు బ్యాలెట్ బాక్సులకు సంబంధించిన సీళ్లు, చిరునామా ట్యాగ్లను మే 15లోగా ముద్రించాలని పంచాయతీరాజ్ కమిషనర్ను ఎస్ఈసీ ఆదేశించింది.తెలంగాణలో సర్పంచుల పదవీకాలం గత ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసింది. మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు

...మిగతాది 2 లో




## మల్కాజ్ గిరిలో నువ్వు గెలుస్తావ్

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 26 :
బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. తరచూ నోరు జారి లేదా తనదైన శైలిలో కామెంట్లు చేసి హైలైట్ అయ్యే ఆయన తాజాగా మరోసారి కూడా అలాగే వ్యవహరించారు. ఈసారి పార్టీ లైన్ దాటి వ్యవహరించినట్లుగా తెలుస్తోంది. మల్కాజ్ గిరిలో బీజేపీ అభ్యర్థి గెలుస్తారంటూ వ్యాఖ్యలు చేశారు. మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున అభ్యర్థిగా ఈటల రాజెందర్ ఉన్న సంగతి తెలిసిందే. ఈసారి మల్కాజ్ గిరిలో ఈటల రాజేందర్

...మిగతాది 2 లో

తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ముక్కోణపు పోరాటంలా సాగుతున్నాయి. పైకి ఇలా కనిపిస్తున్నా జరుగుతున్న రాజకీయాన్ని చూస్తే మాత్రం.. రేవంత్ వర్సెస్ బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా పోరాటం జరుగుతోంది. అటు భారతీయ జనతా పార్టీ, ఇటు బీఆర్ఎస్ పార్టీ కూడా పూర్తిగా కాంగ్రెస్ పార్టీని కార్నర్ చేయడం లేదు. రేవంత్ రెడ్డినే టార్గెట్ చేస్తున్నాయి.

# కాంగ్రెస్ కాదు... రేవంత్ టార్గెట్




**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 26:** రేవంత్ రెడ్డి సీఎంగా ఉండరని ప్రభుత్వం కూలిపోతుందని హెచ్చరికలు కూడా చేస్తున్నాయి. రేవంత్ రెడ్డి కూడా తనపై బీఆర్ఎస్, బీజేపీ కలిసి కుట్ర పన్నుతున్నాయని పాలమూరు బిడ్డ సీఎం పదవిలో ఉండకుండా చేసేందుకు కలిసిపోయారని అంటున్నారు రేవంత్ రెడ్డి ఆ రెండు పార్టీలు చేస్తున్న రాజకీయాన్ని అడ్వాంటేజ్ గా తీసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కన్నా రేవంత్ రెడ్డే ప్రమాదకరంగా బీజేపీ, బీఆర్ఎస్ భావిస్తున్నాయా ? హామీలు అమలు చేయకపోతే రేవంత్ రాజీనామా చేస్తారా అని హరీష్ రావు సవాల్ చేశారు. రెడీ అని రేవంత్ రెడ్డి అన్నారు. లోక్ సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఉంటుందో ఉండదో చెప్పలేనని కేసీఆర్ అంటున్నారు. తనతో పాతిక మంది ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని అంటున్నారు. కానీ తాము ప్రభుత్వాన్ని పడగొడతామని ఆయన చెప్పడం లేదు. బీజేపీ పడగొడుతుందని జోస్యం చెబుతున్నారు. అగ్రనేతలే కాదు.. కేటీయార్, హరీష్ రావు, బీజేపీలో జీ కిషన్ రెడ్డి మొదలుకుని బండి సంజయ్, లక్ష్మణ్, డీకే అరుణ, ఏలేటి మహేశ్వరరెడ్డి, రఘునందనరావుకు ప్రతిరోజు రేవంత్ ను టార్గెట్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడం కంటే రేవంత్ ను టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీని ఓడించాలనుకుంటున్నారు. రేవంత్ రెడ్డిని రెండు ప్రదాన పార్టీలు టార్గెట్ చేస్తున్నాయంటే.. ఆయన బలం పెరిగిందనే అర్థం. నిజానికి కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేయాలి.

ఆ పార్టీపై వ్యతిరేకత పెంచాలి. కానీ రేవంత్ రెడ్డిపై వ్యతిరేకత పెంచితే చాలని విజయం వస్తుందని.. ఓటర్లు మారిపోతారని బీఆర్ఎస్, బీజేపీ అనుకుంటున్నాయి. ఆయన ముఖ్యమంత్రి కాబట్టి ఆయనను టార్గెట్ చేస్తున్నారని అనుకోవడానికి లేదు. రేవంత్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం విస్తృతంగా శ్రమిస్తున్నారు .ఓ వైపు పీసీసీ చీఫ్ గా మరో వైపు సీఎంగా రెండు బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. కింది నుంచి ఎదిగిన రేవంత్ రెడ్డికి ఆ సామర్థ్యం ఉంది. కష్టపడి అనేకమంది ప్రత్యర్థులను ఎదుర్కొని చాకచక్యంతో సందర్భానికి తగ్గ నిర్ణయాలు తీసుకుని ఉన్నత స్థానానికి ఎదిగారు రేవంత్రెడ్డి. గ్రూపులకు నిలయమైన కాంగ్రెస్ లో చేరిన కొద్ది కాలంలోనే ముఖ్యమంత్రి అయ్యారు. చెప్పదలచుకున్నది సూటిగా సుత్తిలేకుండా చెప్పటం, విషయ పరిజ్ఞానం ఉండటం, జనాలకు ఆకట్టుకునే వాగ్ధాటి ఉండటం రేవంత్ స్టైల్. అందుకే ఆయన ప్రజల్లో తిరుగులేని నేతగా ఎదుగుతున్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పై ప్రజల్లో ఆదరణ ఉన్నా .. ఏకతాటిపైకి నడిపించే నాయకుడు లేకపోవడం వల్లనే రెండు సార్లు ఓడిపోయిందన్న అభిప్రాయం ఉంది. మూడో సారి ఎన్నికలు జరిగేనాటికి ఆ లోటును రేవంత్ రెడ్డి తీర్చేశారు. తనకు పీసీసీ చీఫ్ పోస్టు ఇవ్వడంపై పార్టీలో వ్యతిరేకత వచ్చినా ఆయన సమన్వయంతో సరి చేసుకున్నారు.

ముఖ్యమంత్రి పదవి వచ్చినప్పుడు కూడా ఆయన అంతే అందర్నీ కలుపుకుని వెళ్లారు. ఇప్పుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి నేతలు కూడా ఆయనే పదేళ్లుగా సీఎంగా ఉంటారని చెబుతున్నారు. రేవంత్ రెడ్డి ఇక్కడే చాణక్యం చూపిస్తూ ఉంటారు. నల్లగొండ పర్యటనకు వెళ్లి.. కోమటిరెడ్డికి కూడా ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉందని చెబుతూ ఉంటారు. ఇలా నొప్పింపక ..తానొవ్వక అన్న పద్దతిలో రేవంత్ రెడ్డి పార్టీలో పట్టు పెంచుకుంటూ ప్రజల్లో పలుకుబడి పెంచుకుంటూ ఇతర పార్టీలకు ప్రధాన ప్రత్యర్థిగా మారారు. రేవంత్ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందని ఒకరు, లోక్ సభ ఎన్నిక లవుతూనే రేవంత్ పతనం మొదలవుతుందని మరొకరు, ఒక ఏడాది కంటే రేవంత్ ప్రభుత్వం కొనసాగదని ఇంకొకరు రేవంత్ పతనం కాంక్షిస్తున్నారు.రేవంత్అంతకు మించి కొనసాగితే తమ ఉనికి ప్రశ్నార్థకమవుతుందని వీళ్లంతా భయపడుతున్నారన్న కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. బీజేపీ నేతలు కిషన్, బండి, రఘునందన్ ఇలా ప్రతిఒక్కరు ప్రతిరోజు రేవంత్ జపమే చేస్తున్నారు.

తమ ఆరోపణలు, విమర్శలన్నింటినీ రేవంత్ ప్రధానంగానే చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని, పార్టీని రేవంత్ చీల్చేస్తాడని, రేవంత్ తెలంగాణా షిండే అయిపోతాడని కాంగ్రెస్ లో ఆయనపై నమ్మకం తగ్గించే వ్యూహం అమలు చేస్తున్నారు. వీరు ఎన్ని చేసినా రేవంత్ తనదైన శైలిలో ప్రచారం చేసుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పది కిపైగా పార్లమెంట్ స్థానాల్లో గెలిపిస్తే రేవంత్ ఇమేజ్ మరింత పెరుగుతుంది. అప్పుడు మరింత ఎక్కువగా రేవంత్ వర్సెస్ ఇతర పార్టీలు అన్నట్లుగానే రాజకీయం మారుతుంది. రేవంత్ నీడలోనే కాంగ్రెస్ ఉండిపోతుంది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## రూ. వంద కోట్లకు

ఆయన తెలంగాణ రాష్ట్రం నుంచి రిచెస్ట్ ఎంపీ అభ్యర్థుల జాబితాలో మూడో స్థానంలో నిలిచారు. ఆయన మొత్తం సంపద రూ.228.46 కోట్లుగా ప్రకటించారు. MIM అధినేత అసదుద్దీన్ ఒవైసీపై హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా కె మాధవిలతా పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి బరిలో ఉన్న ఆమె ఆస్తులు... మొత్తం రూ.218.38 కోట్లుగా ఉన్నాయి. రూ.27 కోట్ల వరకు అప్పులు కూడా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి సమీర్ వలీవుల్లాను కాంగ్రెస్ పోటీకి దింపిన సంగతి తెలిసిందే.

వంద కోట్లకుపైగా ఆస్తులను ప్రకటించిన అభ్యర్థులు వీరే... ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పోటీ చేస్తున్న నామా నాగేశ్వర్‌రావు నికర సంపద రూ.155.89 కోట్లుగా ప్రకటించారు. భువనగిరి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న క్యామ మల్లేశ్ రూ. 145.33 కోట్ల ఆస్తుల(కుటుంబ సభ్యులతో కలిపి)ను కలిగి ఉన్నారు. నిజామాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధర్మపురి అర్వింద్... మొత్తం నికర ఆస్తుల విలువ 109.89 కోట్లుగా ప్రకటించారు. మొత్తం అప్పుల విలువ రూ.30.67 కోట్లుగా ఉంది. జహీరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్ ఆస్తులు రూ. 151 కోట్లుగా ఉంది. కంచర్ల కృష్ణారెడ్డి, గాలి అనిల్ కుమార్ రూ. 50 కోట్లకుపైగా ఆస్తులు కలిగి ఉన్నారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు మే 13న పోలింగ్ జరగనుండగా.. జూన్ 4న ఫలితాలు వెల్లడికానున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తొమ్మిది స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ నాలుగు సీట్లు గెలుచుకుంది. ఒక స్థానంలో MIM గెలవగా.. మిగిలిన మూడు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.

## ఓటు వేసినా ఒక్కటే

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసినా.. కాంగ్రెస్‌కు ఓటు వేసినా బావుల వద్ద మోటార్లకు కరెంటు మీటర్లు పెడతారని చెప్పారు కేసీఆర్. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రుణమాఫీ చేస్తామని అన్నారని.. ఇప్పటికీ రైతుబంధు కూడా రాలేదని దుయ్యబట్టారు. తులం బంగారం ఇస్తా అన్నారు.. వచ్చాయా? నిలదీశారు. ప్రస్తుతం ఉన్న సీఎం ఛోటే భాయ్.. నరేంద్ర మోదీ బడే భాయ్. ఛోటే బాయ్‌కి ఓటు వేసినా.. బడే భాయ్ కి ఓటు వేసిన ఒక్కటే అవుతుందన్నారు. “ముస్లిం సోదరులారా తెలంగాణలో ఇప్పటి వరకు మేము సెక్యులర్ ప్రభుత్వం నడిపించాం.. ఇప్పటి వరకు సెక్యులర్‌గా ఉన్నాం, ప్రాణం పోయిన సెక్యులర్‌గానే ఉంటాం. పవిత్ర రంజాన్ మాసంలో మేము ప్రతి సంవత్సరం రంజాన్ తోఫా ఇచ్చే వాళ్లం.. ఈసారి ఈ ప్రభుత్వం రంజాన్ తోఫా ఇచ్చిందా మీకు? దేశంలో ఎక్కడా లేని విధంగా నమాజ్ చదివే ఇమామ్ లకు జీతాలు ఇచ్చాం. ఈ బడే భాయ్, చోటే భాయ్ ఒక్కటే. ఆలోచించి ఓటు వేయండి ముస్లిం సోదరులారా”అని కేసీఆర్ కోరారు. బీజేపీ అక్కరాని సుట్టమన్నారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. మొక్కినా వరమియ్యని వేల్పు అని చెప్పుకొచ్చారు. ఎందుకు భారతీయ జనతా పార్టీకి ఓటు వేయాలి ? అని ప్రశ్నించారు. వారికి ఓటేసి మన కన్ను మనమే పొడుసుకుందామా? మనకు విషం ఇస్తే మనమే తాగుదామా? దయచేసి ఆలోచన చేయాలి’ అంటూ ప్రజలను కోరారు. పాలమూరు ఎత్తిపోతల పథకం కట్టుకొని జాతీయ హోదా కోసం 100 ఉత్తరాలు రాశామని- - - కానీ కేంద్రంలోని బీజేపీ మాత్రం హోదా ఇవ్వలేదని ఆరోపించారు. మోదీ పాలనలో రూపాయి విలువ పడిపోయిందన్నారు. దేశంలో మోదీ 157 మెడికల్ కాలేజీలు పెడితే... తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. చట్టం ప్రకారం రాష్ట్రంలో ఎన్ని జిల్లాలు ఉంటే అన్ని జిల్లాలకు ఒక్కో నవోదయ పాఠశాల ఇవ్వాలి- - - కానీ తెలంగాణకు ఒక్క నవోదయ పాఠశాల అయినా ఇవ్వలేదని గుర్తు చేశారు. అలాంటి బీజేపీకి ఎందుకు ఓటు వేయాలనేది ప్రజలంతా ఆలోచించాలని కోరారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు కేసీఆర్. తెలంగాణ హక్కుల కోసం పోరాడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అని... ఎంపీలను గెలిపిస్తే పార్లమెంట్ లో రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతారని చెప్పారు.

## 91 వేల కోట్ల డాలర్లు..

రష్యా నిలిచాయి.ఇక రక్షణ కోసం ప్రపంచ దేశాలు గతేడాది 2,44,300 కోట్ల డాలర్లు వెచ్చించాయని సిప్రి తెలిపింది. 2022తో పోలిస్తే ఆ మొత్తం 6.8% అధికమని పేర్కొంది. 2009 తర్వాత రక్షణ వ్యయం ఒక ఏడాదిలో ఇంత ఎక్కువ పెరగడం ఇదే తొలిసారని వెల్లడించింది. వరుసగా తొమ్మిదో ఏడాది ఈ వ్యయంలో పెరుగుదల నమోదైందని తెలిపింది.ఇక సిప్రి నివేదిక ప్రకారం.. భారత రక్షణ వ్యయం 2022తో పోలిస్తే 2023లో 4.2% పెరిగింది. 2014తో పోలిస్తే అది 44% పెరిగింది. సిబ్బంది, నిర్వహణ వ్యయాల పెరుగుదలే భారత రక్షణ వ్యయం అధికం కావడానికి ప్రధాన కారణం. 2023 నాటి మొత్తం మిలిటరీ బడ్జెట్లో వాటిదే మూడో వంతు వాటా. చైనా, పాకిస్తాన్తో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో.. సాయుధ బలగాల సమర సన్నద్ధతను బలోపేతం చేసుకునేందుకు భారత్ ప్రాధాన్యమిస్తోంది. మిలిటరీ వ్యయంలో దాదాపు 22% బడ్జెట్ను రక్షణరంగ కొనుగోళ్లకు కేటాయిస్తోంది. అందులో 75% వాటా దేశీయ కొనుగోళ్లకే వెళ్తుంది. సిప్రి నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఆసియా, ఓషియానా, పశ్చిమ ఆసియాలో భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా గతేడాది ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయం పెరిగింది. అమెరికా రక్షణ వ్యయం 2022తో పోలిస్తే నిరుడు 2.3% పెరిగింది. 2014తో పోలిస్తే ఆదేశ రక్షణ వ్యయంలో పెరుగుదల 9.0%గా ఉంది. సైనిక వ్యయం పరంగా ఉక్రెయిన్ గతేడాది ప్రపంచంలో 8వ స్థానంలో నిలిచింది. 2023లో ఈ రంగంపై ఆదేశం అత్యధికంగా ఖర్చు చేసింది. మొత్తం 6,490 కోట్ల డాలర్లు వెచ్చించింది. రష్యా రక్షణ వ్యయంలో ఇది 50 శాతం మాత్రమే.

## లోకసభ తర్వాత స్థానిక సమరం

పదవీకాలం జూలై 3వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎస్ఈసీ కసరత్తు మొదలు పెట్టింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు వాయిదా పడడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. లోక్సభ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఏర్పాట్లు స్పీడప్ చేసింది.ఇక, పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్లకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలను కూడా రాష్ట్ర ఎన్నిల సంఘం ఇప్పటికే సేకరించింది. తాజాగా బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో మొదటి నుంచి పంచాయతీ ఎన్నికలను బ్యాలెట్ బాక్సులతోనే నిర్వహిస్తోంది. ఈసారి కూడా అదే రీతిలో జరిపించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ బ్యాలెట్ బాక్సులకు కాగితపు సీళ్లు, చిరునామా ట్యాగ్లు అంటించాల్సి ఉంది. దీనికోసం వాటి ముద్రణ చేపట్టాలని నిర్ణయించింది. పేపర్ సీళ్లతోపాటు పోలింగ్ కేంద్రం, గ్రామం, మండలం, జిల్లాలను సూచించే ట్యాగ్లను ఆంగ్ల, తెలుగు భాషల్లో ముద్రించాలని నిర్ణయించింది. వీటిని హైదరాబాద్లోని ప్రింటింగ్ ప్రెస్లో ముద్రించాలని పంచాయతీరాజ్ కమిషనర్కు సూచించింది. లోక్సభ ఎన్నికల ప్రక్రియ జూన్ నాలుగో తేదీతో ముగుస్తుంది. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే వీలుంది. తేదీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలో ఇప్పటికే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై కసరత్తు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే జూన్లో ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత రెండు మూడు నెలల వ్యవధిలో అభిప్రాయ సేకరణ చేసి నివేదిక సమర్పించే అవకాశం ఉంది. దీనిని ప్రభుత్వం ఆమోదించి రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల సంఘానికి తెలియజేయాల్సి ఉంటుంది.

## కోటి దాటేసిన హైదరాబాద్ ఓటర్లు

ఉంటుందని అంచనా.ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే ఓటర్ల సంఖ్య ఉన్నప్పటికీ... గ్రేటర్ హైదరాబాద్ లో మాత్రం ఓటింగ్ శాతం మాత్రం సగం దాటి ముందుకు వెళ్లడం లేదు. ఈ క్రమంలోనే నగరంలోని ఓటర్లలో అవగాహన పెంచేందుకు ఎన్నికల కమిషన్ ఇప్పటికే పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ప్రధాన కూడళ్లు, బస్ స్టేషన్ ,రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, వీధి నాటకాలు, తదితర కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. మరోవైపు కాలనీ సంక్షేమ సంఘాలు, సీనియర్ సిటిజన్ సంఘాలు, ఫారం ఫర్ గుడ్ గవర్నెన్స్ వంటి ప్రధాన సంస్థలు ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు విశేషంగా కృషి చేస్తున్నాయి. ఎన్నికల గడువు సమీపిస్తున్నప్పటికీ రాజకీయ పార్టీల ప్రచారం మాత్రం ఇంకా జోరు అందుకోలేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు నుంచే ప్రచారాలు మొదలు పెట్టినప్పటికీ......ఈసారి ఎన్నికల్లో మాత్రం అలా కనిపించడం లేదు.ఎన్నికల కమిషన్ లెక్కల ప్రకారం... 2019 లోక్ సభ ఎన్నికల నాటికి గ్రేటర్ లో 90.47 లక్షల మంది ఓటర్లు ఉంటే గతేడాది నవంబర్ నాటికి ఆ సంఖ్య 99 లక్షలకు చేరింది. ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 1.05 కోట్లకు చేరింది.

## ప్రశాంతంగా ముగిసిన..

ఉన్నవారికి కూడా ఓటేసే అవకాశం కల్పిస్తున్నారు.

**త్రిపురలో అత్యధికం..**

లోక్ సభ ఎన్నికల రెండో దశ పోలింగ్ లో త్రిపురలో అత్యధికంగా 77.93 శాతం పోలింగ్ నమోదు అయింది. మణిపూర్ (76.46 శాతం), పశ్చిమ బెంగాల్ (71.84 శాతం), చత్తీస్ గఢ్ (72.13 శాతం), అసోం (70.67 శాతం) రాష్ట్రాల్లో కూడా సాయంత్రం 6 గంటల వరకు అధిక పోలింగ్ శాతం నమోదైనట్లు భారత ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి.

**యూపీలో అత్యల్పం..**

మరోవైపు, లోక్ సభ ఎన్నికల రెండో దశ పోలింగ్ లో ఉత్తర ప్రదేశ్ లో అత్యల్ప పోలింగ్ నమోదైంది. యూపీలో అత్యల్పంగా 52.91 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాలు వివరించాయి. మహారాష్ట్ర, బిహార్, మధ్య ప్రదేశ్ ల్లో కూడా తక్కువ స్థాయిలోనే పోలింగ్ శాతం నమోదైంది. మహారాష్ట్రలో 53.71 శాతం, బిహార్ లో 53.6 శాతం, మధ్యప్రదేశ్ లో 55.16 శాతం, రాజస్థాన్ లో 59.35 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటల వరకు కేరళలో 64.8 శాతం, కర్ణాటకలో 64.4 శాతం, జమ్మూ కాశ్మీర్లో 67.22 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 88 లోక్ సభ స్థానాలకు ఏప్రిల్ 26, శుక్రవారం రెండో దశ పోలింగ్ జరిగింది.

**ఫేజ్ 2 ఓటింగ్ ముఖ్యాంశాలు**

1. రెండో దశలో ఓటు వేసిన భారత దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. ఎన్డీఏ సుపరిపాలనను ఓటర్లు కోరుకుంటున్నారని, యువత, మహిళా ఓటర్లు ఎన్డీఏకు మద్దతిస్తున్నారని ప్రధాని ఆ పోస్ట్ లో పేర్కొన్నారు.
2. రాజీవ్ చంద్రశేఖర్, వి.మురళీధరన్, వీరేంద్ర కుమార్ వంటి కేంద్ర మంత్రులు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి, నటి హేమమాలిని, అరుణ్ గోవిల్, తేజస్వి సూర్య, శశిథరూర్, రాహుల్ గాంధీ వంటి ప్రముఖులు రెండో దశలో బరిలో ఉన్నారు.
3. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి మతం పేరుతో ఓట్లు అడిగినందుకు భారతీయ జనతా పార్టీ (BJP) నాయకుడు, బెంగళూరు దక్షిణ ఎంపి తేజస్వి సూర్యపై భారత ఎన్నికల సంఘం (ECI) కేసు నమోదు చేసింది.
4. త్రిపురలో స్థిరపడిన బ్రూ శరణార్థులు లోక్ సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారు మిజోరాంకు తిరిగి రాకుండా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం ఇది రెండోసారి.
5. ఛత్తీస్ గఢ్ లో నక్సల్స్ ప్రాబల్యం అధికంగా ఉన్న మూడు లోక్ సభ నియోజకవర్గాల్లో (కంకేర్, రాజ్ నంద్ గావ్, మహాసముంద్) సాయంత్రం 5 గంటల వరకు 72 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
6. కట్టుదిట్టమైన భద్రత మధ్య పోలింగ్ జరుగుతుండగా, ఎన్నికల విధుల్లో ఉన్న ఓ పోలీసు గరియాబంద్ జిల్లాలో సర్వీస్ వెపన్ తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
7. తొలి దశలో 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 స్థానాలకు ఏప్రిల్ 19న పోలింగ్ జరిగింది. 34.8 లక్షల మంది తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. లోక్ సభ ఎన్నికలు ఏడు దశల్లో జరుగుతుండగా, జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## మల్కాజ్ గిరిలో నువ్వు గెలుస్తావ్

గెలుస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో జరిగిన ఒక ఫంక్షన్ లో ఈ ఆసక్తికర పరిణామం జరిగింది. అదే ఫంక్షన్ కు మల్కాజ్ గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కూడా హాజరయ్యారు. అలా ఆ ఫంక్షన్ లో మల్లారెడ్డి, ఈటల రాజేందర్ కలుసుకున్నారు. ఆప్యాయంగా ఒకరితో మరొకరు ఫోటో దిగారు. అడిగి మరీ ఈటలతో ఫోటో దిగారు.. మల్లారెడ్డి. మల్కాజ్ గిరిలో ఈసారి నువ్వే గెలుస్తున్నవ్ అన్నా.. అంటూ మాట్లాడారు. “మల్కాజిగిరిలో ఇంకెవరు గెలుస్తారు. నువ్వే గెలుస్తున్నవ్” అంటూ ఈటల రాజేందర్ ను గట్టిగా హత్తుకున్నారు. ఈ పరిణామం బీఆర్ఎస్ వర్గాలను షాక్ కు గురి చేసినట్లు అయింది. ఓవైపు పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక సీట్లు కోసం బీఆర్ఎస్ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తూ ఉంది. స్వయంగా కేసీఆర్ రంగంలోకి దిగి రోడ్ షోల ద్వారా జనాల్లోకి వెళ్తున్నారు. బీఆర్ఎస్ అత్యధిక ఓట్లు సాధించుకోవడం కోసం కష్టపడుతుంటే.. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఈటల రాజేందర్ తో ఇలా వ్యవహరించడం చర్చనీయాంశం అవుతోంది.మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గంలోనే మల్లారెడ్డి, ఆయన అల్లుడు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. మల్కాజ్ గిరిలో మొతం ఏడు సీట్లు బీఆర్ఎస్ గెలుచుకుంది. అలాంటి చోట బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుస్తారని స్వయంగా మల్లారెడ్డి బహిరంగంగా ప్రకటించడం చర్చనీయాంశమైంది.

అన్నా నువ్వే గెలుస్తున్నావ్! ఈటలతో మాజీ మంత్రి మల్లారెడ్డి

# బెరియాట్రిక్ సర్జరీతో హై-బిఎమ్ఐ పేషెంట్స్లో మధుమేహం దూరం

» కేర్ ఆసుపత్రి వైద్యుల ఘనత

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 26:**




జీవనశైలి కారణంగా చాలామంది ప్రజలు మధుమేహం మారిన పడుతున్నారు. ఇది ఒకసారి వచ్చిందంటే దీని నుంచి బయటపడటం దాదాపు అసాధ్యం. ఈ వ్యాధి వచ్చినవారు మందులు తీసుకుంటూ, జీవనశైలి మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇటీవల ఒరిస్సా రాష్టానికి చెందిన ముగ్గురు వ్యక్తులు హై బి.ఎం.ఐ. తో బాధప డుతూ డయాబెటిస్ నుంచి పూర్తిగా బయటపడ్డారు. దశాబ్ద కాలంగా పోరాడుతున్న వారు కేర్ ఆసుపత్రి బంజారాహిల్స్లో ట్రాన్స్ఫర్మేటివ్ సర్జరీ తో ఉపశమనం పొందగలిగారని కేర్ ఆసుపత్రి బంజారాహిల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీ సయ్యద్ కమ్రాన్ హుస్సేన్ శుక్రవారం విడుదల చేసిన ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్ఫర్మేటివ్ సర్జరీ తరువాత వారు డయాబెటిస్ మందులు వాడాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇప్పుడు ఆరోగ్యకరమైన జీవితం గడుపుతున్నట్లు డయాబెటిస్ లేదా మెటబాలిక్ సర్జరీ అని పిలిచే ఈ సర్జరీని లాపరోస్కోపికల్లా పర్ఫార్మ్ చేస్తారు. ఈ సర్జరీలో భాగంగా హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపించడానికి కడుపు, పేగులను తిరిగి మారుస్తారని కేర్ ఆసుపత్రి వైద్యులు డా. వేణుగోపాల్ పరీక్, సీనియర్ కన్సల్టెంట్ GI, లాపరోస్కోపిక్ & రోబోటిక్ బారియాట్రిక్ సర్జన్, ఈ రోజు విడుదల చేసిన ఒకే పత్రిక ప్రకటనలో తెలిపారు. బెరియాట్రిక్ సర్జరీతో మధుమేహం దూరం అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నపుడు కొంతమంది పొట్టను తగ్గించుకోవడానికి సిద్ధమవుతారు. వ్యాయామం చేయడం, భోజనం తగ్గించినా పొట్ట ఇంచుకూడా తగ్గకపోవడంతో బెరియాట్రిక్ సర్జరీకి వెళ్తారు. అలా వెళ్లిన వారికి మధుమేహం కూడా పూర్తిగా తగ్గిపోతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. మందులు ఏ మాత్రం వాడాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. ఈ సర్జరీ చేయించుకున్న ఆ ముగ్గురు వినిత్ కుమార్ బన్సాల్ (35/M ఒడిశా), వినయ్ కుమార్ బన్సాల్ (35/M ఒడిశా), మదన్ చందర్ బారిక్ (45/M ఒడిశా) వీరు కొద్దీ కాలంగా హై బి.పి, అధిక నియంత్రిత చక్కెరలు మరియు ఊబకాయం కారణంగా వారికి వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, శ్వాస ఆడకపోవడం, రక్తపోటు, నిద్రలేకపోవడం, భారీ గురకతో సమస్యల తో బాధపడుతూ కొంతకాలంగా రోజూ మందులు వాడుతున్నా, వారి రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలోకి రాకపోవటంతో చివరికి ట్రాన్స్ఫర్మేటివ్ సర్జరీ చేయించుకుని వారి తగిన ఆరోగ్య సమస్యలు నుండి ప్రాణాలు కాపాడుకోగలిగారు అని కేర్ ఆసుపత్రి డా. వేణుగోపాల్ పరీక్, సీనియర్ కన్సల్టెంట్ GI, లాపరోస్కోపిక్ & రోబోటిక్ బారియాట్రిక్ సర్జన్ తెలిపారు. ఊబకాయం అనేది శరీరంలో కొవ్వు నిల్వల పెరుగుదలతో కూడిన దీర్ఘకాలిక ప్రగతిశీల వ్యాధి. డయాబెటిస్ మెల్లిటస్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు భారీ వ్యయాన్ని కలిగించే మరొక పెద్ద మహమ్మారిగా మారింది. T2DM అభివృద్ధి మరియు అధిక బరువు లేదా ఊబకాయం మధ్య బాగా స్థిరపడిన లింక్ ఉంది. బారియాట్రిక్ శస్త్రచికిత్స అనేది స్థూలకాయం, T2DM ఉన్న రోగులకు బాగా గుర్తించబడిన, సమర్థవంతమైన చికిత్సా ఎంపిక, ఇక్కడ బారియాట్రిక్ సర్జరీ యొక్క ప్రయోజనాలు సాధారణ బరువు తగ్గడం కంటే ఎక్కువగా ఉంటాయి.

**శస్త్రచికిత్స ప్రయోజనాలు**

డా. వేణుగోపాల్ పరీక్, సీనియర్ కన్సల్టెంట్ GI, లాపరోస్కోపిక్ & రోబోటిక్ బారియాట్రిక్ సర్జన్ ప్రకారం, మధుమేహం శస్త్రచికిత్స అనేది అధిక HBA1c స్థాయిలు ఉన్న రోగులకు ఒక మంచి ఎంపిక. ఇది 23 నెలల్లో సగటు రక్తంలో చక్కెర స్థాయిలను సాధారణ స్థితికి తీసుకొస్తుంది. ఫలితంగా జీవితకాలం పెరుగుతుంది. క్వాలిటీ ఆఫ్ లైఫ్ ఇంప్రూవ్ అవుతుంది.



## ఈటల రాజేందర్ కు మద్దతుగా బీజేపీ ప్రచారం

**జయభేరి, మేడ్చల్ :**

పది సంవత్సరాల బీజేపీ పాలనలో దేశంలో తీసుకొచ్చిన అనేక సంస్కరణలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి పథకాలు నరేంద్రమోదీ హ్యాట్రిక్ ప్రధానమంత్రి అవ్వడానికి దోహదం చేస్తాయని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి అన్నారు. మున్సిపల్ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కు మద్దతుగా చేపట్టిన ఎన్నికల ప్రచారంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కు మద్దతుగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్ అమరం సరస్వతి, జిల్లా బిజెవైఎం అధికార ప్రతినిధి కావేరి శ్రీధర్, నాయకులు కిషన్, ఆంజనేయులు, వేణు,,సాయిరెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలని విన్నపం

» ఎన్ సి ఎస్ సి ఛైర్మన్ కిషోర్ మాక్వానా ను కలిసిన తెలంగాణ దళిత సమాఖ్య రాష్ట అధ్యక్షుడు బీఎన్ రామ్మోహన్




**జయభేరి, ఏప్రిల్ 26 :**

జాతీయ కమిషన్ ఆఫ్ షెడ్యూల్డ్ కులాల (ఎన్.సి.ఎస్.సి) ఛైర్మన్ కిషోర్ మక్వానాను తెలంగాణ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బిఎన్. రాంమోహన్ మర్యాద పూర్వకంగా కలిశారు. శామీర్పేట్ మండలం తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్ గ్రామానికి చెందిన బిఎన్.రామ్ మోహన్ న్యూఢిల్లీలోని ఎన్.సి.ఎస్.సి కార్యాలయంలో ఛైర్మన్ ను కలిశారు. అనంతరం దళితుల సమస్యల పట్ల చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ దళితులపై వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. అదేవిధంగా పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారికంగా జరిపించాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16(4) ప్రకారం సమాన అవకాశాలను అందుబాటులో ఉంచడానికి, సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించాలని ఉద్దేశించబడ్డాయని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం దళితులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటు పడాలని కోరారు. అయితే దీనిపై సానుకూలంగా స్పందించిన ఎన్.సి.ఎస్.సి ఛైర్మన్ కిషోర్ మక్వానా వీలైనంత త్వరలో ఈ విషయంపై రాష్ట్ర డిజిపికి లేఖ రాసి పంపిస్తామని హామి ఇచ్చారు.



## ఆర్ వి బాక్స్ క్రికెట్ జోన్ ప్రారంభోత్సవం

» ముఖ్య అతిథులుగా పాల్గొన్న తుంగతుర్తి రవి, కాంగ్రెస్ నాయకులు

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మూడో డివిజన్ పరిధిలోని సాయి ప్రియ కాలనీలో ఆర్ వి బాక్స్ క్రికెట్ స్టేడియం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, మల్కాజ్గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి కుమార్తె, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొని నిర్వహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య నేతలు మాట్లాడుతూ.. కాంక్రీట్ జంగల్ గా మారిన నేటి పట్టణాలలో యువకులకు క్రీడా స్థలాలు కరువయ్యాయని, ఇలాంటి బాక్స్ క్రికెట్ స్టేడియాలు యువతకు ఆనందంతో, పాటు ఆరోగ్యాన్ని ఇస్తాయని, ఔత్సాహిక క్రికెటర్లకు బాక్స్ క్రికెట్ స్టేడియాలు ఎంతో దోహదపడతాయని తుంగతుర్తి రవి తెలుపుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభాకర్ రావు కి రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయలేదు



**జయభేరి, హైదరాబాద్:**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కొనసాగుతుందని హైదరాబాద్ నగర్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రభాకర్ రావు కి రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయలేదు. ఊహాగానాలు తో దర్యాప్తు ను ఇబ్బంది పరుస్తున్నారు. రాజకీయ నేతల ప్రమేయం పై దర్యాప్తు కొనసాగుతుంది. ప్రభాకర్ రావు ను పట్టుకోవడం లేదనేది వార్త అవాస్తవం ప్రభాకర్ దర్యాప్తు అధికారులకు అందుబాటులోకి రాలేదు సరైన సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసు వివరాలు వెల్లడిస్తామని అన్నారు. మాజీ ఇంటలిజెన్స్ అధికారి ప్రభాకర్ రావు ఎక్కడున్నాడో ఇప్పటివరకు తెలియదు. ఈ కేసులో నిందితులంతా చాలా స్మార్ట్ గా, ఇంటలిజెంట్ గా వ్యవహరించారు. మా శక్తి మేరకు ఈ కేసులో దర్యాప్తు చేస్తున్నాం. వ్యక్తిగత జీవితాలకు భంగం కలిగించేలా టాపింగ్ చేశారు. వ్యక్తిగత జీవితాలలోకి ప్రవేశించడం అనేది ఘోరమైన నేరం. నలుగురు పోలీస్ ఆఫీసర్స్ ప్రమేయం ఉంది అరెస్ట్ చేశాము. ఈ కేసులో మరి కొంత మంది పోలీసులను సాక్షులగా పెట్టాము. సాక్షుల స్టేట్మెంట్లను రికార్డ్ చేశామని అన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధి సేవకుడు -రాగిడి

**జయభేరి, ఉప్పల్ :**




నమ్మకమైన నాయకుడు మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి సేవకుడు రాగిడి లక్ష్మా రెడ్డి ని భారీ మెజార్టీ తో గెలిపించుకుందాం. మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా నాగేశ్వరావు. రామంతపూర్ డివిజన్, శుక్రవారం ఉదయం గాంధీనగర్, శ్రీరామా కాలనీ లో మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా నాగేశ్వరావు అధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డి గెలుపుకై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్తాక్ డివిజన్ ప్రెసిడెంట్ ,బిఆర్ఎస్ సినియర్ నాయకులు రేపాక కుమారస్వామి,మధుసూదన్ రెడ్డి ,జంగయ్య,శ్రీనివాస్ రెడ్డి ,సురం శంకర్, బొసాని పవన్, జహంగీర్, డాన్ శ్రీను, శంకర్ అన్న, మద్దూరి శ్రీనివాస్, మందపాటి శ్రీనివాస్ రెడ్డి, ధనుంజయ్ గౌడ్, సాగర్, రవి, చేగురి శ్రీను, టోనీ, అపీల్ శ్రీనివాస్, గోపి చారీ, వనంపల్లి శ్రీనివాస్ రెడ్డి, సంధ్య, జానకి,స్వప్నా ,రాధమ్మ, కుర్న లక్ష్మి, మంజుల, భాగ్య, సబితా, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గన్పార్క్ చేరిన రుణమాఫీ రాజకీయం

» రాజీనామాకు రావాలని రేవంత్కు హరీష్ సవాల్

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 26**




తెలంగాణలో ఓ వైపు లోక్సభ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషిగా నిలబెట్టేందుకు ప్రతిపక్షాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అస్త్రంగా మలుచుకొని లోక్సభ ఎన్నికల్లో దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నాయి. ఆరు హామీలతోపాటు రైతు రుణమాఫీ, రైతు బంధు పథకాల అమలు తీరుపై విమర్శలు చేస్తున్నాయి. కేవలం తప్పుడు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని నమ్ముతున్న బీఆర్ఎస్... వాటిపైనే ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి వాటిపైనే ప్రశ్నలు సంధిస్తోంది. అందులో ముఖ్యంగా రైతులకు సంబంధించిన సమస్యలనే ప్రధానంగా ప్రస్తావిస్తూ లోక్సభ ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. అధినేత నుంచి సోషల్ మీడియా ఫాలోవర్ వరకు రైతుల సమస్యలనే ప్రధాన అస్త్రంగా చేసుకొని కాంగ్రెస్ను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నిర్వహించిన ప్రతి సభలో చెప్పినట్టు రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఎప్పుడు చేస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తూ వచ్చారు. ఈ మధ్య జరిగిన ఓ సభలో వీటికి సమాధానంగా రేవంత్ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. లోక్సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆగస్టు కచ్చితంగా రుణ మాఫీ చేస్తామని చెప్పుకొచ్చారు. అలా చేస్తే బీఆర్ఎస్ నేతలు ముఖ్యంగా హరీష్ రాజకీయల నుంచి తప్పుకుంటాలా అని సవాల్ చేశారు. ఇలా మొదలైన యుద్ధం ఇప్పుడు పీక్కు చేరుకుంది. ఒకేసారి రుణ మాఫీ చేస్తే తాను రాజీనామా చేయడమే కాకుండా రాజకీయాల నుంచే తప్పుకుంటానని హరీష్ సవాల్ చేశారు అలాగనే గన్పార్క్ వద్ద ప్రమాణ చేస్తానని... రేవంత్ కూడా రావాలని పిలుపునిచ్చారు. అన్నట్టుగానే ఈ ఉదయం హరీష్ రావు గన్ పార్క్ వద్దకు రాజీనామా పత్రంతో వచ్చారు. రాజీనామా పత్రంతో గన్ పార్క్ వద్దకు హరీశ్రావు తన అనుచర గణంతో చేరుకున్నారు. విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు కూడా అక్కడకు చేరుకున్నాయి. అయితే ఆయన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనలకు ఎలాంటి అనుమతి లేదని ఆయన్ని తప్పి పంపించారు. పోలీసుల జోక్యం చేసుకోవడంతో కాసేపు గన్ పార్క్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గన్ పార్క్ వద్ద మీడియాతో మాట్లాడిన హరీశ్రావు... రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన సవాల్ స్వీకరించాలని అన్నారు. రేవంత్ రాలేని పక్షంలో తన సిబ్బందితోనైనా రాజీనామా పత్రాన్ని పంపించాలని సూచించారు. అందరి ముందు ఇద్దరి రాజీనామా పత్రాలను పెడతామని... అన్న మాట ప్రకారం ఆగస్టు 15 లోపు ఏక కాలంలో ప్రతి రైతుకి ఉన్న రెండు లక్షల రూపాయల రుణాన్ని మాఫీ చేయాలన్నారు. లేకుంటే రాజీనామాలు ఆమోదించుకొని రాజకీయాల నుంచి తప్పుకోవాలని సవాల్ చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసిందని ఇప్పుడు రుణ మాఫీ అంటూ మరో కొత్త మోసానికి తెరలేపిందన్నారు హరీష్. తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన తమకు రాజీనామాలు లెక్క కాదన్నారు. ఆ రైతుల రుణమాఫీ కోసం రాజీనామా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని... రేవంత్ రెడ్డి సిద్ధమా కాదా అనేది తేలాలన్నారు.

## జహంగీర్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

» ఎమ్మెల్యే బాల నాయక్



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి మండల గుమ్మడవల్లి గ్రామానికి చెందిన షేక్ జహంగీర్ ఆకస్మిక మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఈ సందర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ స్నేహశీలి, మృధుస్వభావి, అందరితో స్నేహంగా ఉండే జహంగీర్ గుమ్మడవల్లి గ్రామానికి మూడు పర్యాయలు ఉపసర్పంచ్ గా సేవలు అందించారని అన్నారు. జహంగీర్తో నాకు మంచి స్నేహబంధం వుండేదాని, వారితో గడిపిన క్షణాలు మరువలేనివి అని గుర్తు చేశారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ ఛైర్మన్ అలంపల్లి నర్సింహా, ముస్లిం మత పెద్ద ముఫ్తి జావీద్ హుస్సేన్ ఖస్మి, మొహమ్మద్ ఖుద్రతుల్లా,దూదిపాల వేణుధర్ రెడ్డి, పసునూరి యుగేందర్ రెడ్డి, కుంభం శ్రీనివాస్ గౌడ్,సముద్రాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## నేనా... ప్రజాశాంతి పార్టీనా

**జయభేరి, వరంగల్, ఏప్రిల్ 26:**

మాజీ మంత్రి, సినీనటుడు బాబూమోహన్ వరంగల్ లోక్సభ స్థానం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేశారు. మధ్యాహ్నం వరంగల్ రిటర్నింగ్ అధికారి ఆఫీసుకు చేరుకున్న ఆయన నడుము నొప్పితో ఇబ్బంది పడగా.. స్టాఫ్ వీల్చైర్ ఏర్పాటు చేసి లోనికి పంపారు. రిటర్నింగ్ ఆఫీసర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందజేశారు బాబుమోహన్. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. కేఏ పాల్ ప్రజాశాంతి పార్టీ నుంచి నామినేషన్ వేస్తారనే ప్రచారం జరిగిందని మీడియా మిత్రులు ప్రశ్నించగా.. . బీజేపీ నుంచి బయటకు వచ్చాక.. కేఏ పాల్ కాఫీకి రమ్మంటే వెళ్లానని, అక్కడ పాల్ తనకు కండువా కప్పి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి ఇచ్చారని వెల్లడించారు. తాను ఎలాంటి పార్టీ సభ్యత్వం తీసుకోలేదని, అదే రోజు ఆ పార్టీకి గుడ్ బై చెప్పానట్లు వివరించారు. వరంగల్లో కొందరు ఫాలోవర్స్ కోరిక మేరకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశానట్లు తెలిపారు.



# కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు యోగా

కాలేయం ఆరోగ్యంగా ఉండేందుకు కొన్ని రకాల యోగా భంగిమలు ఉన్నాయి. వాటి చేస్తే మీరు ఆరోగ్యంగా ఉండవచ్చు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా మనకు సహాయపడుతుంది. రోజూ యోగా చేయడం వల్ల మీలో పూర్తిగా మార్పు వస్తుంది. కొద్ది రోజుల్లోనే మీ శరీరంలో మార్పును మీరు చూడవచ్చు. శరీరం మొత్తం పనితీరును మెరుగు పరచడానికి యోగా సహాయపడుతుంది.

కాలేయ సంబంధిత సమస్యల నుండి బయటపడటానికి కూడా యోగా ఉపయోగకరంగా ఉంటుంది. కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం వల్ల మనకు కాలేయం వాపు, దానికి సంబంధించిన అనేక వ్యాధులు వస్తాయి. కాలేయ వాపు శరీరం తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుంది. అయితే ఈ రుగ్మతల నుంచి బయటపడేందుకు యోగా సాధన చేయవచ్చు. ఇది కాలేయం, ఇతర అంతర్గత అవయవాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కూడా సహాయపడుతుంది. వాటి గురించి తెలుసుకుందాం..

**త్రికోణాసనం**

త్రికోణాసనం లేదా త్రిభుజ భంగిమ మన ఆరోగ్యానికి గొప్ప ప్రయోజనాలను అందిస్తుంది. త్రికోణాసనం కాలేయ ఆరోగ్యానికి సహాయపడుతుంది. కొవ్వు కాలేయం వంటి తీవ్రమైన పరిస్థితులను నయం చేస్తుంది. త్రికోణాసనం చేయడం ద్వారా శరీరం వశ్యత, బలం, సమతుల్యతను పొందుతుంది. త్రికోణాసనం అన్ని రకాల ఆరోగ్య సమస్యలను నయం చేయడానికి స్థిరంగా ఉంటుంది.

**భుజంగాసనం**

భుజంగాసనం చేయడం ద్వారా మీరు మంచి శరీర బలం, శక్తిని పొందుతారు. ఇది బయటి భాగాన్ని బలపరుస్తుంది. ఆరోగ్యానికి సహాయపడుతుంది. ఈ ఆసనం చేయడం వల్ల కాలేయం టాక్సిన్స్‌ను బయటకు పంపుతుంది. అంతే కాదు ఈ ఆసనం ద్వారా ఉదర అవయవాలన్నీ ఉత్తేజాన్ని పొందుతాయి. ఇది శారీరక శక్తిని, రక్త ప్రసరణను కూడా పెంచుతుంది.

**శలభాసన**

శలభాసన ఆరోగ్య సంరక్షణ పరంగా అనేక సానుకూల మార్పులను తీసుకు వస్తుంది. శలభాసనం అనేక ఆరోగ్య సమస్యలను సులభంగా తొలగిస్తుంది. లక్షణాలను తగ్గిస్తుంది. ఇలా చేయడం ద్వారా వెన్నెముక వశ్యత, రక్త ప్రవాహం మెరుగుపడతాయి. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడటం ద్వారా మీరు కొన్ని ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందుతారు. ఇది ఒత్తిడి, జీర్ణక్రియ, శ్వాసకోశ పనితీరును మెరుగుపరుస్తుంది.

**ధనురాసనం**

ధనురాసనం ఆరోగ్య సంరక్షణలో గొప్ప మార్పులను తీసుకువస్తుంది. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. జీర్ణక్రియ బాగుంటుంది. ధనురాసనం టాక్సిన్స్‌ను బయటకు పంపి శరీరంలోని అసౌకర్యాన్ని పూర్తిగా తొలగిస్తుంది.

**మత్స్యాసనం**

మత్స్యాసనం చేయడం ద్వారా మీ శరీరంలో అసాధారణమైన మార్పులను చూడవచ్చు. ఇది శరీరంలో అన్ని రకాల మార్పులకు కారణమవుతుంది. మానసిక ఒత్తిడిని తొలగించడంలో, శరీర అవాంతరాలను నిరోధించడంలో, అంతర్గత అవయవాలను బలోపేతం చేయడంలో, ఉత్తేజపరచడంలో సహాయపడుతుంది.

ఫ్యాటీ లివర్ ఉన్నప్పుడు యోగా చేయడం వల్ల శరీరంలో అనేక మార్పులు సంభవిస్తాయి. నిజం ఏమిటంటే ఇది కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. లక్షణాల నుండి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది. శారీరక, మానసిక ఆరోగ్యం విషయంలో యోగా ఎల్లప్పుడూ ఉత్తమ ఎంపిక అనడంలో సందేహం లేదు. ఇది మీ బలం, శక్తిని పెంచడానికి కూడా గొప్పది. కాలేయ ఆరోగ్యాన్ని పెంచడంతో పాటు, యోగా ప్రసరణ, జీర్ణక్రియ, బరువు నిర్వహణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.



బీసీసీఐ ఏ ముహూర్తాన ఐపీఎల్ 17ను ఆరంభించిందో గానీ ఈ సీజన్‌లో బ్యాటర్ల వీరవిహారంతో మ్యాచ్ మ్యాచ్‌కూ పాత రికార్డులు బద్దలవుతున్నాయి. 2008 నుంచి 2022 దాకా ఆర్సీబీ (263)కి తప్ప మరే జట్టుకూ సాధ్యంకాని 250+ స్కోరును 2024లో పలు జట్లు ఇప్పటికే ఏడు సార్లు సాధించాయి. శుక్రవారం కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), పంజాబ్ కింగ్స్ మ్యాచ్ కూడా సరికొత్త రికార్డులకు వేదికైంది. చారిత్రక ఈడెన్‌గార్డెన్స్ వేదికగా బౌండరీల జాతరగా సాగిన మ్యాచ్ అభిమానులకు ఫుల్ మజాను అందించింది. కేకేఆర్ బ్యాటర్లు పూనకం వచ్చినట్టు ఊగిపోయి 262 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపినా పంజాబ్ బాదుడుకు ఇవి సరిపోలేదు. మరో 8 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని పూర్తి చేసి ఐపీఎల్‌తో పాటు టీ20 ప్రపంచ క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగుల ఛేదనను విజయవంతంగా ముగించిన ఆ జట్టు రికార్డు పుటల్లోకెక్కింది. కేకేఆర్ తరపున సాల్ట్, నరైన్ తుఫాను సృష్టిస్తే పంజాబ్ ఓపెనర్ బెయిర్ స్టో సునామీలా విరుచుకుపడగా ఆఖర్లో శశాంక్ అగ్నిపర్వతంలా బద్దలు కావడంతో సంచలన విజయం అందుకుంది.

# టీ20ల్లో 262 సరిపోలె..

## కోల్‌కతాను చిత్తుచేసిన కింగ్స్... బెయిర్ స్టో అజేయ శతకం

## శశాంక్, ప్రభ్‌సిమ్రన్ వీరవిహారం... సాల్ట్, నరైన్ మెరుపులు వృథా

ఈడెన్ గార్డెన్స్‌లో పరుగుల సునామీకి ప్రపంచ పొట్టి క్రికెట్‌లో రికార్డులన్నీ మూగబోయాయి. సొంత ఇలాఖాలో కోల్‌కతా నైట్ రైడర్స్ మొదట బ్యాటింగ్ చేస్తూ 261 పరుగులు చేసినా.. భారీ ఛేదనను పంజాబ్ 18.4 ఓవర్లలోనే పూర్తిచేసి పొట్టి ఫార్మాట్ చరిత్రలో సరికొత్త రికార్డును సృష్టించింది. మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 261 పరుగులు చేసింది. ఫిల్ సాల్ట్ (37 బంతుల్లో 75, 6 ఫోర్లు, 6 సిక్సర్లు), సునీల్ నరైన్ (32 బంతుల్లో 71, 9 ఫోర్లు, 4 సిక్సర్లు) దంచికొట్టారు. ఛేదనలో పంజాబ్ ఓపెనర్ జానీ బెయిర్ స్టో (48 బంతుల్లో 108 నాటౌట్, 8 ఫోర్లు, 9 సిక్సర్లు), శశాంక్ సింగ్ (28 బంతుల్లో 68 నాటౌట్, 2 ఫోర్లు, 8 సిక్సర్లు) ప్రభ్‌సిమ్రన్ సింగ్ (20 బంతుల్లో 54, 4 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో మరో 8 బంతులు మిగిలుండగా రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి గెలిచింది. బెయిర్‌స్టోకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

ఈ సీజన్‌లో భీకరమైన ఫామ్‌లో ఉన్న కోల్‌కతా ఓపెనర్లు సాల్ట్, నరైన్ మరోసారి ఈడెన్‌గార్డెన్‌లో ఎప్పటిలాగే చెలరేగగా బాధితులుగా మారింది మాత్రం పంజాబ్ బౌలర్లు. బంతి బౌలర్ చేతి నుంచి రిలీజ్ అవడమే తరువాయి దాని గమ్యం బౌండరీ లైన్‌ను ముద్దాడటమో లేదంటే స్టాండ్స్‌లో ప్రేక్షకుల చేతుల్లోకి పడటమో అన్నంత రేంజ్‌లో వాళ్ల విధ్వంసం సాగింది. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిన వీళ్లిద్దరి బాదుడుతో 8 ఓవర్లకే కేకేఆర్ స్కోరు 100 పరుగుల మైలురాయిని దాటింది. 23 బంతుల్లోనే నరైన్ అర్ధ సెంచరీ పూర్తికాగా 25 బంతుల్లో సాల్ట్ ఫిఫ్టీ ముచ్చట తీర్చుకున్నాడు. ప్రమాదరకంగా మారుతున్న ఈ జోడీని ఎట్టకేలకు రాహుల్ చాహర్ 11వ ఓవర్లో విడదీయడంతో 138 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కరన్ 13వ ఓవర్లో సాల్‌ట్‌ను బౌల్డ్ చేసినా కోల్‌కతా పరుగుల ప్రవాహానికి అడ్డుకట్ట పడలేదు. వెంకటేశ్ అయ్యర్ (23 బంతుల్లో 39, 3 ఫోర్లు), ఆండ్రీ రస్సెల్ (12 బంతుల్లో 24, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), శ్రేయస్ అయ్యర్ (10 బంతుల్లో 28, 1 ఫోర్, 3 సిక్సర్లు) దొరికిన బంతిని దొరికినట్టుగా బాదడంతో కేకేఆర్ ఈ సీజన్‌లో రెండోసారి 250 ప్లస్ స్కోరు సాధించింది. రికార్డు ఛేదన చూసి పంజాబ్ బెదరలేదు. తామేమైనా తక్కువ తిన్నామా అన్నట్టుగా కింగ్స్ ఓపెనర్లు శివాలెత్తారు. పవర్ ప్లేలో ప్రభ్‌సిమ్రన్ కోల్‌కతా బౌలర్లను ఊచకోత కోస్తే అతడి తర్వాత వంతు బెయిర్ స్టోది. హర్షిత్ రాణా 2వ ఓవర్లో రెండు సిక్సర్లతో మొదలైన ప్రభ్‌సిమ్రన్ మెరుపులు.. చమీర 3వ ఓవర్లో 6, 4, 6, 4తో పతాకస్థాయికి చేరాయి. 18 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేసుకున్న అతడు బెయిర్ స్టో అనవసర పరుగు తీసే క్రమంలో రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత బెయిర్ స్టో బాదుడు బాధ్యతలను భుజాన వేసుకున్నాడు. చక్రవర్తి 9వ ఓవర్లో వన్ హ్యాండెడ్ సిక్సర్‌తో 23 బంతుల్లోనే 50 రన్స్ పూర్తిచేసిన బెయిర్ స్టో ఆ తర్వాత ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. చక్రవర్తి, రస్సెల్‌ను లక్ష్యంగా దాడికి దిగాడు. రస్సెల్ 12వ ఓవర్లో 3 సిక్సర్లతో సెంచరీకి చేరువయ్యాడు. రూసో (16 బంతుల్లో 26, 1 ఫోర్, 2 సిక్సర్లు) రెండో వికెట్‌కు 38 బంతుల్లోనే 85 పరుగులు జోడించాడు. ఈ జోడీని నరైన్ విడదీసినా శశాంక్ సింగ్‌తో కలిసి పంజాబ్ స్కోరును 15 ఓవర్లకే 200 మార్కును దాటించాడు. 45 బంతుల్లోనే సెంచరీ పూర్తిచేశాక బెయిర్ స్టో కాస్త తగ్గాడు. కానీ మరో ఎండ్‌లో శశాంక్.. సిక్సర్ల హోరుతో ఈడెన్‌ను ముంచెత్తడంతో 262 పరుగుల లక్ష్యం మూగబోయింది.

42 టీ20 క్రికెట్‌లోనే అత్యధిక సిక్సర్లు (42) నమోదైన మ్యాచ్ ఇదే. ఇంతకు ముందు హైదరాబాద్, ముంబై మధ్య ఈ సీజన్‌లోనే ఉప్పల్ వేదికగా ముగిసిన మ్యాచ్‌లో 38 సిక్సర్లు నమోదయ్యాయి.

523 ఇరు జట్లూ చేసిన పరుగులు. ఐపీఎల్‌లో ఇది మూడో అత్యధికం. ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లో ఇరు జట్లూ 549 పరుగులు చేశాయి. ఈ రెండు సందర్భాలలోనూ నాలుగు జట్లూ 250+ స్కోర్లు చేశాయి.

264 ఐపీఎల్‌తో పాటు టీ20 క్రికెట్‌లో ఇదే అత్యుత్తమ ఛేదన. అంతర్జాతీయ క్రికెట్‌లో సౌతాఫ్రికా.. వెస్టిండీస్‌పై 259 పరుగులను ఛేదించింది. ఐపీఎల్‌లో రాజస్థాన్.. పంజాబ్‌పై 224(2020 సీజన్) స్కోరును ఊదేసింది.

4 ఈ మ్యాచ్‌లో నలుగురు ఓపెనర్లూ (సాల్ట్, నరైన్, ప్రభ్‌సిమ్రన్, బెయిర్ స్టో) అర్ధ శతకాలు సాధించారు. ఐపీఎల్ చరిత్రలో ఇదే ప్రథమం.

**37 ఫోర్లు**


**42 సిక్స్‌లు**

**సంక్షిప్త స్కోర్లు**

కోల్‌కతా: 20 ఓవర్లలో 261/6 (సాల్ట్ 75, నరైన్ 71, అర్ష్‌దీప్ 2/45, చాహర్ 1/33).

పంజాబ్: 18.4 ఓవర్లలో 262/2 (బెయిర్ స్టో 108 నాటౌట్, శశాంక్ 68 నాటౌట్, నరైన్ 1/24)

# మీ భాగస్వామి చిరాకుగా ఉన్నప్పుడు ఇలా అస్సలు చేయొద్దు





చిరాకు అనేది మనుషులకు సాధారణం. అయితే జంటలో ఒకరు చిరాకుగా ఉన్నప్పుడు ఇంకొకరు కొన్ని పనులు చేయకపోవడమే మంచిది.

చాలా మంది వ్యక్తులు తమ భాగస్వామి ప్రపంచంలోని అందరికంటే ఎక్కువగా తమను ప్రేమించాలని కోరుకుంటారు. కానీ మీరు గాఢంగా ప్రేమిస్తున్నారని ఎంత చెప్పినా కొన్నిసార్లు కొన్ని విషయాలు మీకు ఇబ్బందిని కలిగిస్తాయి. అప్పుడప్పుడు ఆ ప్రేమను పరీక్షిస్తాయి. ఇది భాగస్వాముల మధ్య భరించలేని ప్రవర్తన గురించిన విషయం. భాగస్వామి ప్రవర్తన బంధాన్ని దెబ్బతీయడం వివాహంలో కొత్తేమీ కాదు. మనం చాలా సీరియస్‌గా ఏదైనా చెప్పినప్పుడు, భాగస్వామి టీవీలో కామెడీ షో చూడటమో, ఫోన్‌లో రీల్స్ చూడటమో చేస్తారు. ఇది చాలా చిరాకు అనిపించే విషయం. ఆ ఫోన్‌ని దూరంగా విసిరివేయండి, దానిని పగలగొట్టండి, టీవీని ఆపివేయండి అని అరుస్తూ ఉంటాం. ఇవి ఒకేలా ఉండనవసరం లేదు.. ఒక్కో జంటకు ఒక్కో విధంగా ఉంటుంది. భాగస్వామి అనేక ప్రవర్తనలు, అవి పెద్దవి లేదా చిన్నవి కావచ్చు.. మీ సహనాన్ని పరీక్షిస్తాయి. కొన్నిసార్లు మీరు చిన్న విషయాలకే చిరాకు పడవచ్చు. అలాంటి ప్రవర్తన లేదా ప్రవర్తన ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదు. చికాకు కలిగించే భాగస్వామి ప్రవర్తనకు గట్టిగా స్పందించడం అస్సలు పరిస్థితిని శాంతపరచదు. చాలా మంది భాగస్వాములు వివాహంలో చేసే అసలు పొరపాటు అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వారికి చికాకు తెప్పించే విషయంలో తప్పు ఎప్పుడూ మీ వైపు ఉండకూడదు, కానీ మీ బ్యాలెన్స్‌ను ఉంచుకోవడం కూడా ముఖ్యమే. ఆరోగ్యకరమైన వివాహం కోసం ప్రతి జంట ఆచరించాల్సిన మంచి అలవాటు ఇది. మీ భాగస్వామి చిరాకుగా ఉంటే.. మీరు గట్టిగా అరవకండి. పరిస్థితి మారిపోతుంది. బదులుగా ఓపికపట్టండి, మీ భాగస్వామితో తర్వాత చర్చించండి.

**రెచ్చగొట్టకూడదు**

రెచ్చగొట్టే పరిస్థితులలో భాగస్వాముల నుండి తరచుగా జరిగే మరొక తప్పు ఏమిటంటే ఇతరుల ప్రవర్తనను విమర్శించడం. ఎప్పుడూ తన మాట వినకపోవడం, ఏమీ చెప్పకపోవడం, సొంత పనులు కూడా చేసుకోకపోవడం, ప్లేట్ కూడా తీయకపోవడం, ఇతరులలా పని చేయకపోవడం వంటి విమర్శలు భాగస్వామిని కలవరపరుస్తాయి. మీరు విమర్శలు చేస్తే మీ భాగస్వామి ఆ ప్రవర్తనను ఎప్పటికీ వదులుకోలేరని గ్రహించండి. ఎదుటి వ్యక్తి ఇలాంటి ఫిర్యాదులను తమ వ్యక్తిత్వంపై దాడి చేసే విమర్శలుగా చూస్తారు. సానుకూల అంశాల గురించి ఎప్పుడూ ఆలోచించరు. అభ్యంతరాలు లేవనెత్తడానికి ప్రయత్నిస్తారు.

**ఆరోపణలు చేసుకోకూడదు**

ఇలాంటి సమయాల్లో ఫిర్యాదు చేయడం, విమర్శించడం ద్వారా మీ అంతర్గత కోపాన్ని వెళ్లగక్కుతారు. మీ భాగస్వామిలో మీకు కోపం తెప్పించే ప్రవర్తనను తొలగించడానికి లేదా దాని కారణంగా కలిగించే సమస్యలను తొలగించడానికి మీరు పరిష్కారాన్ని ప్రతిపాదించరు. తప్పులను హైలైట్ చేయడానికి, నిందించడానికి మాత్రమే ప్రయత్నిస్తారు.

ఇలాంటి ఆరోపణలు, విమర్శలు చేసే బదులు వారి ప్రవర్తన వారిని ఎలా ప్రభావితం చేస్తుందో చెప్పి వారిని ఒప్పించే ప్రయత్నం చేయండి. దానిని మార్చుకుంటే మంచిదని స్పష్టం చేయండి. అలాంటి సూచనలు భాగస్వామి ఆత్మగౌరవాన్ని ఎప్పుడూ భంగపరచవు.

**అరవకూడదు**

ఏదైనా ప్రవర్తన చిరాకు తెప్పించినప్పుడు అరవడానికి బదులుగా.. ఒకరితో ఒకరు పోరాడుకునే బదులు, ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి



# ఆ ఒక్కటీ అడక్కు

## అంటున్న అల్లరి నరేష్


అల్లరి నరేష్ కథానాయకుడిగా నటిస్తున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'ఆ ఒక్కటి అడక్కు'. మల్లి అంకం దర్శకుడు. చిలకా ప్రొడక్షన్స్ పతాకంపై రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. మే 3న ప్రేక్షకుల ముందుకురానుంది. ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తున్నది. మ్యూజికల్ ప్రమోషన్‌లో భాగంగా 'హమ్మమ్మో..' అనే మెలోడీ ప్రధాన గీతాన్ని విడుదల చేశారు. గోపీసుందర్ స్వరపరచిన ఈ పాటను యశస్వి కొండేపూడి ఆలపించారు. భాస్కరభట్ల సాహిత్యాన్నందించారు. 'జ్యోతిష్యాన్ని బాగా నమ్మే ఓ యువకుడు ప్రేమలో పడితే ఎదురైన సంఘటనలేమిటన్నదే ఈ చిత్ర కథాంశం. ఆద్యంతం హాస్య ప్రధానంగా సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. చాలా విరామం తర్వాత అల్లరి నరేష్ చేస్తున్న ఫుల్‌లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇది' అని చిత్ర బృందం పేర్కొంది. వెన్నెల కిషోర్, జామీ లివర్, వైవా హర్ష, ఆరియానా గ్లోరీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సూర్య, సంగీతం: గోపీసుందర్, సహ నిర్మాత: భరత్ లక్ష్మీపతి, దర్శకుడు: మల్లి అంకం.

# ప్రేమ బంధానికి గుడ్‌బై?

## శాంతను హజారికాతో శృతిహాసన్ బ్రేకప్

అగ్ర కథానాయిక శృతిహాసన్ తన ప్రేమబంధానికి గుడ్‌బై చెప్పిందా? అంటే ఔననే అంటున్నాయి ముంబయి సినీ వర్గాలు. డూడుల్ ఆర్టిస్టు శాంతను హజారికాతో ఈ భామ కొంతకాలంగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. తన లవ్‌ఎఫైర్‌పై శృతిహాసన్ బహిరంగంగా ఎప్పుడూ స్పందించనప్పటికీ..ప్రియుడితో తీయించుకున్న ఫొటోలను తరచుగా సోషల్‌మీడియాలో పోస్ట్ చేసేది. ఈ జంట ముంబయిలో సహజీవనం సాగిస్తున్నారనే వార్తలు కూడా వచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఈ జంట విడిపోయినట్లు తెలిసింది. వ్యక్తిగత కారణాల వల్ల విడిపోయారని, పరస్పర అంగీకారంతోనే తమ బంధానికి గుడ్‌బై చెప్పుకున్నారని వార్తలొస్తున్నాయి. ఈ ప్రచారానికి బలం చేకూరుస్తూ ఈ ప్రేమజంట సోషల్‌మీడియాలో ఒకరినొకరు అన్‌ఫాలో అయ్యారు. 'ఈ ప్రయాణంలో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నా. ఇతరులనూ అర్థం చేసుకున్నా' అంటూ శృతిహాసన్ పెట్టిన పోస్ట్ కూడా వారి బ్రేకప్‌ను నిర్ధారిస్తున్నదని అమె అభిమానులు అంటున్నారు. అయితే ఈ వార్తల్లో నిజానిజాలేమిటో తెలియాలంటే ప్రేమికులిద్దరిలో ఎవరో ఒకరు స్పందించాల్సిందేనని అభిమానులు అనుకుంటున్నారు. ఇక కెరీర్‌పరంగా శృతిహాసన్ వరుస విజయాలతో దూసుకుపోతున్నది. ప్రస్తుతం డెకాయిట్, చెన్నై స్టోరీ చిత్రాల్లో శృతిహాసన్ నటిస్తున్నది.





# పరదా

## వెనక కథ

'టిల్లు స్కేర్' చిత్రంతో ఇటీవల మంచి విజయాన్ని దక్కించుకుంది అనుపమ పరమేశ్వరన్. తాజాగా ఈ భామ మహిళా ప్రధాన ఇతివృత్తంతో రూపొందుతున్న 'పరదా' చిత్రంలో నటిస్తున్నది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకాడ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్, కాన్సెప్ట్ వీడియోను శుక్రవారం అగ్ర నాయిక సమంత, దర్శకనిర్మాతలు రాజ్ అండ్ డీకే విడుదల చేశారు. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో సంప్రదాయ లంగా వోణిలో కనిపిస్తున్నది అనుపమ పరమేశ్వరన్. కాన్సెప్ట్‌లో వీడియోలో 'యత్ర నార్యస్తు పూజ్యంతే..' అనే ప్రసిద్ధ శ్లోకం వినిపిస్తున్నది. దీనిని బట్టి స్త్రీ ఆత్మగౌరవాన్ని చాటే కథాంశమిదని అర్థమవుతున్నది. వినోదంతో పాటు హృదయాన్ని స్పృశించే బలమైన భావోద్వేగాలను ఈ సినిమాలో ఆవిష్కరించబోతున్నామని, ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలో తీసుకెళ్లే కథ ఇదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: మృదుల్ సుజిత్ సేన్, సంగీతం: గోపీసుందర్, దర్శకత్వం: ప్రవీణ్ కాండ్రేగుల.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com